

ప్రాంగణం లేక ప్రయాసలు!

భూత్పూర్ పురపాలికలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ మార్గంలో ప్రయాణించే వారు నడిరోడ్డుపై నిలబడి బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కూర్చోడానికి వసతి లేక సంచులు చేత పట్టుకుని, పిల్లలను ఎత్తుకుని బస్సుల కోసం వేచి చూస్తూ విసిగి వేసారుతున్నారు. ఆ దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ఈనాడు

మహబూబ్‌నగర్

సోమవారం అక్టోబరు 7, 2024

మూడో వారంలో కొనుగోలు కేంద్రాలు

- పాలమూరులో 28 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర





సీసీఐ డీజీఎం మహేశ్వర్‌రెడ్డితో ముఖాముఖి

ఈనాడు, మహబూబ్‌నగర్: భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులు ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాను తీసుకు రావాలని సీసీఐ మహబూబ్‌నగర్ శాఖ డీజీఎం మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈసారి పత్తి క్వింటాకు రూ. 7,521 మద్దతు ధరను సంస్థ ప్రకటించిందని చెప్పారు. పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల మూడోవారంలో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిన్నింగ్ మిల్లులు, రవాణాకు సంబంధించిన టెండరు ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై డీజీఎంతో 'ఈనాడు' ముఖాముఖీలో వెల్లడించిన అంశాలిలా ఉన్నాయి.

? **ప**త్తికి మద్దతు ధర ఎలా ఉంది? వర్షానికి పంట దిగుబడి, తేమ శాతంపై ప్రభావం పడింది? రైతుల పరిస్థితి ఏమిటి?

✔ **ప**త్తికి సీసీఐ మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. తేమ శాతం 8-12 మధ్యలో ఉండేలా చూసుకోవాలి. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర ఉంటుంది. తేమ శాతంలో తేడా ఉంటే ధరలో స్వల్ప మార్పు ఉంటాయి.

? **ఉ**మ్మడి జిల్లాలో పత్తి సాగు ఎంత? దిగుబడి ఎంత వస్తుందని అంచనా వేస్తున్నారు?

✔ **ఉ**మ్మడి జిల్లాలో మొత్తం 2,43,237 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. సుమారు 30 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా వేస్తున్నాం. వీటి ద్వారా 6.08 లక్షల బేళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

? **రెం**డేళ్లుగా రైతులు ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు? సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు? ఈసారి అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలున్నాయా?


✔ **గ**త రెండేళ్లు ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాకు సీసీఐ మద్దతు ధర కంటే అధికంగా రేటు పలికింది. చాలా మంది రైతులు ప్రైవేటు మార్కెట్‌కు వెళ్లారు. తర్వాత విపణిలో పత్తికి డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈసారి సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి.

? **సీ**సీఐ ద్వారా విక్రయిస్తే రైతులకు డబ్బులు రావడానికి ఆలస్యమవుతుందని అంటున్నారు?

✔ **సీ**సీఐ ద్వారా పత్తి విక్రయించే రైతులకు వారంలోగా డబ్బు ఖాతాలో జమవుతాయి. ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న బ్యాంకు ఖాతాను మాత్రమే రైతు తీసుకురావాలి. కేవైసీ చేసుకోకుంటే డబ్బు రావడంలో సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. కేంద్రాలకొచ్చే సమయంలో రైతు తన ఆధార్‌కార్డు తీసుకురావాలి. రైతు రాలేని పరిస్థితి ఉంటే కుటుంబ సభ్యుడిని పంపించవచ్చు. దీనికి సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువపత్రం తీసుకురావాలి.

? **ప**త్తి కొనుగోలు కేంద్రాలెక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

✔ **పా**లమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్-2, నాగర్‌కర్నూల్-18, నారాయణపేట-8, వనపర్తి-1, జోగులాంబ గద్వాలలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. టెండర్లలో పాల్గొన్న జిన్నింగ్ మిల్లులను త్వరలోనే నోటిఫై చేస్తాం. రవాణా కోసం వాహనాల టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తికానుంది.



బఫర్ జోన్ మింగేశారు

- చిన్న కాల్వలా మారిపోయిన కొత్తచెరువు వాగు
- అలుగు మొదలు ఖలీల్‌చౌక్ వరకు ఆక్రమణలు



ఖలీల్‌చౌక్ ఏరియాలో వాగును సగానికి ఆక్రమించి నిర్మించిన ఇళ్లను ఆనుకుని పారుతున్న కొత్తచెరువు నీరు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పాలమూరు నడిబొడ్డున ఉన్న పెద్దచెరువుకు, కొత్తచెరువుకు మధ్య గొలుసుకట్టుగా ఉన్న కొత్తచెరువు వాగు బఫర్ జోన్‌ను ఆక్రమణదారులు మింగేశారు. కొత్తచెరువు మొదలు మడుగునగర్, ఖలీల్ చౌక్, టీడీగుట్ట మైదానం వరకు సుమారు 2 కి.మీ.ల పొడవునా ఐదు మీటర్ల వెడల్పుతో ఉన్న వాగును అడుగడుగునా ఆక్రమించి పిల్ల కాల్వలా మార్చేసి ఇళ్లు, ప్రహరీలు నిర్మించారు. పురపాలక పట్టణ ప్రణాళికా విభాగం వెనకా ముందు చూడకుండా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం ఇందుకు ప్రధాన కారణం. కొత్త చెరువు వాగు పొడవునా 33, 34 వార్డుల పరిధిలోని మడుగునగర్, ఖలీల్‌చౌక్, నల్‌బౌలీ, ఫైర్‌స్టేషన్ ప్రాంతాలు వస్తాయి. ఈ ప్రాంతాల నుంచి ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్లాట్లను తనిఖీ చేయలేదు. గుడ్డిగా అనుమతులు ఇవ్వడంతో వాగును ఎక్కడికక్కడ ఆక్రమించేసి బఫర్ జోన్లలో ప్రహరీలు, ఇళ్లు నిర్మించారు. కొన్ని చోట్ల వాగును పూర్తిగా పూడ్చేసి కింది భాగంలో పైపులు వేసి అంతర్గత రోడ్లు కూడా నిర్మించారు. కొత్తచెరువు నిండి అలుగు పారినప్పుడల్లా వాగు సమీపంలో నిర్మించిన ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఇటీవల కొత్తచెరువు అలుగు పారడంతో వరద నీరు మడుగునగర్, ఖలీల్‌చౌక్, నల్‌బౌలీ ప్రాంతాల వీధులను ముంచెత్తింది. కొన్ని చోట్ల రాకపోకలు నిలిచాయి. పురపాలక ఛైర్మన్, కమిషనర్, వార్డుల కౌన్సిలర్లు క్షేత్రస్థాయికి చేరుకుని పొక్లెయిన్లతో పలుచోట్ల అక్రమంగా నిర్మించిన అంతర్గత రోడ్లు ధ్వంసం చేసి నీళ్లు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మరికొన్ని చోట్ల వాగును ఆక్రమించి నిర్మించిన ప్రహరీలు, ఇళ్లలోకి నీరు చేరినా వాటిని తొలగించే సాహసం చేయక వెనుదిరిగారు.

చర్యలు తీసుకోకుంటే మళ్లీ ముంపే..

భారీ వర్షాలు మళ్లీ కురిసే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాఖ చెబుతోంది. మళ్లీ ముంపు సమస్య తలెత్తకుండా ఉండాలంటే పురపాలక, రెవెన్యూ శాఖల అధికారులు కొత్త చెరువు అలుగు మొదలు నల్‌బౌలీ, టీడీగుట్ట మైదాన ప్రాంతం వరకు వాగుకు ఇరువైపులా ఆక్రమణలు గుర్తిస్తూ బఫర్‌జోన్ సర్వే చేపట్టాలి. ఆ వెంటనే బఫర్ జోన్ దిమ్మెలు నిర్మించి దాని పరిధిలోకి వచ్చిన ఆక్రమణలకు మార్కింగ్ వేసి ఇళ్ల యజమానులకు నోటీసులు ఇవ్వాలి. నోటీసుల్లో పేర్కొన్న గడువు ముగియగానే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలి. చెరువులు, వాగులను ఆక్రమించి చేపట్టిన ఎలాంటి నిర్మాణాలనైనా మార్గదర్శకాలు పాటిస్తూ తొలగించవచ్చని న్యాయస్థానాలు కూడా చెబుతున్నాయి.




నల్‌బౌలీ ప్రాంతం వెనక భాగంలో కొత్తచెరువు వాగును ఇరువైపులా ఆక్రమించి నిర్మించిన ఇళ్లు



కొత్తచెరువు వాగు బఫర్ జోన్‌లోకే చొచ్చుకు వచ్చి ప్రహరీ నిర్మించిన రైస్‌మిల్ యజమాని

లలితా త్రిపుర సుందరీదేవిగా మైసమ్మ



నవాబ్‌పేట, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ దేవత ఆదివారం లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు కుంకుమార్చన చేశారు. వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వచ్చే భక్తులకు దేవాలయ నిర్వాహకులు సదుపాయాలు కల్పించారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,420

అచ్చంపేట : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం మొక్కజొన్న క్రయవిక్రయాలు నిర్వహించారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,420 మాదిరి ధర రూ. 2,229 కనిష్ఠ ధర రూ. 1,301 వంతున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయస్థానం సమన్లు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమం సకల జనుల సమ్మె నేపథ్యంలో బస్సులను అడ్డుకున్నారన్న అభియోగంతో 28 మంది ఉద్యోగులకు కోర్టు నుంచి సమన్లు అందాయి. మలిదశ ఉద్యమం సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని బస్సులు రోడ్డు మీదకు రాకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ఆర్టీసీ టీఎంయూ సంఘం నాయకులు నిర్వహించిన ధర్నాలో ఐకాస ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా ఉన్న చంద్రానాయక్‌తో పాటు మరో 27 మందిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో నలుగురు మహిళా ఉద్యోగినులు కూడా ఉన్నారు. 2024 నవంబర్ 19న రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ద్వారా మహబూబ్‌నగర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుకావాలని సమన్లు అందాయి. 13 ఏళ్ల క్రితం ఉద్యమం సందర్భంగా కేసులు నమోదయ్యాయని, వాటిని కొట్టివేశారని అనుకున్న దశలో కోర్టుకు హాజరుకావాలని సమన్లు వచ్చాయని చంద్రానాయక్ ఆవేదన వ్యక్తంచేశారు.

డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితాపై కసరత్తు

నేడు కొలిక్కి రానున్న ప్రక్రియ

న్యూస్‌టుడే, పాలమూరు : డీఎస్సీ-2024లో భాగంగా జిల్లాలో 243 పోస్టుల భర్తీకి చేపట్టిన ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 5న ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారిలో విజేతలను ఎంపిక చేస్తున్నారు. ఆదివారం ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య(స్పెషల్ ఎడ్యుకేషన్) ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన కోర్టు నుంచి అనుమతి రావడంతో అందులో 1:3 నిష్పత్తిలో ఎంపికైన వారి ధ్రువపత్రాలను డైట్ కళాశాలలో పరిశీలించారు. వారి కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో 20 పోస్టులు ఉండగా 39 మంది అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. 26 మంది హాజరయ్యారు.

జీహెచ్‌ఎంలతో సమావేశం.: పాఠశాల విద్య రాష్ట్ర సంచాలకుల నుంచి 1:1 నిష్పత్తిలో ఎంపికైన జాబితాలు నేడు డీఈవో కార్యాలయాలకు పంపే అవకాశాలు ఉన్నాయి. దీనిపై డీఈవో ఆధ్వర్యంలో డైట్‌లో 12 పరిశీలన కేంద్రాల్లో పనిచేసిన జీహెచ్‌ఎంలతో సమావేశమై ఎంపిక ప్రక్రియపై కసరత్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంపై అధికారులు దృష్టి సారించారు. కేటాయించిన పోస్టులకు అనుగుణంగా మంచి ర్యాంకులు పొందిన వారిని రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా ఎంపిక చేసి నియామక పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 11 పోస్టులు .జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఉండగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1 పోస్టు ఉంది. ఈ విభాగంలోనే ఎక్కువగా 12 స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు ఉన్నాయి. జీవశాస్త్రంలో 7, ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యలో ఆరు పోస్టులు ఉన్నాయి. మిగతా వాటిలో ఒకటి, రెండు, మూడు పోస్టుల చొప్పున మాత్రమే ఉన్నాయి.



డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితాపై జీహెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహిస్తున్న డీఈవో రవీందర్

ఉన్నతాధికారులకు నివేదికలు : ఉన్నతాధికారుల నుంచి 1:1 జాబితా రాగానే వారికి పోస్టింగులు ఇస్తాం. బహుశా 9వ తేదీన ప్రభుత్వం నియామక పత్రాలను అందించిన తర్వాత అభ్యర్థులకు అంతర్జాలం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశం ఉంది.

- రవీందర్, జిల్లా విద్యాశాఖాధికారి, మహబూబ్‌నగర్.

వాస్కోడగామా రైలుకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న రైల్వే సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్ - వాస్కోడగామా (గోవా) 07039/40 రైలుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ రైలును ప్రారంభించగా మహబూబ్‌నగర్ స్టేషన్‌కు వచ్చింది. స్థానిక సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు స్వాగతం పలికారు. ఈనెల 9 నుంచి అధికారికంగా రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ప్రతి బుధ, శుక్ర వారాల్లో సికింద్రాబాద్ - వాస్కోడగామా వైపు నడవనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో వాస్కోడగామా - సికింద్రాబాద్ ప్రతి గురు, శని వారాల్లో నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

11 యూనిట్లలో జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు వద్ద ఆదివారం వరదనీటి ఉద్ధృతి కొనసాగింది. ప్రాజెక్టుకు 77 వేల క్యూసెక్కుల వరద నీటి ఉద్ధృతి కొనసాగుతుండగా పీజేపీ అధికారులు జల విద్యుత్తు ఉత్పత్తికి 35,837 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.172, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.668 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 237.636, దిగువన 213.739 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి చేపట్టగలిగామని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

గింజను కొలిచి.. బోనస్ ఇస్తారట!

కొత్త నిబంధన తేనున్న ప్రభుత్వం?



ధరూరు మండలం సాగైన వరి పంట

ధరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.500 వరకు బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ సీజన్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి తర్వాత స్థానంలో వరి ఉంది. జూరాల ప్రాజెక్టుతో పాటు ఎత్తిపోతల పథకాలు చెరువులు, బోరుబావుల కింద పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేశారు. సాగువిస్తీర్ణం దాదాపు 6.50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో 80 శాతానికిపైగా సన్నధాన్యమే ఉంటుంది. దసరా నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తేవటానికి కసరత్తు చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కొలుస్తారట: చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించటం కోసం వినియోగించే కాలిపర్స్ పరికరాన్ని సన్నధాన్యం గుర్తించేందుకు వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు పౌరసరఫరాల శాఖ సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ పరికరాల కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కొలిచేదిలా: ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు. ఒక ప్రత్యేక పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లకన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు మిల్లీమీటరుకు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. అటువంటి వాటికే రూ.500 బోనస్ చెల్లిస్తారు.

ఎగ్గొంటేదుకేనా: సన్నరకం ధాన్యలేవి అన్నదానిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. బీపీటీ-5202తో పాటు ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలతో పాటు మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని సూచించింది. అయితే ఈ 37 రకాల్లో మన ఉమ్మడి జిల్లాలో పండించేది ఐదు నుంచి ఆరు రకాలుంటాయి. అలాంటప్పుడు ఈ కొలతలు దేనికని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ సన్నాల కింద ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా కొలతల్లో తేడా వస్తే దొడ్డు కింద పరిగణిస్తే ఎలాగని రైతులంటున్నారు. ఒక్కో వ్యవసాయ క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని రైతులంటున్నారు. కొలతల పేరుతో కొర్రీలు పెట్టి బోనస్ ఎగ్గొంటేందుకే ఈ కొత్త నిబంధన తెరపైకి వస్తోందని రైతులంటున్నారు.

పక్కరాష్ట్రంలో రేటెక్కువుంటే: ఇక ఉమ్మడి జిలాలో గద్వాల, నారాయణపేట వనపర్తి జిల్లాలకు సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్ ఉంది. గతేడాది రూ.3,300 వరకు క్వింటా సన్నరకం ధాన్యం ధర పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న బోనస్ కలిపినా పక్కరాష్ట్రంలో ఉన్న ధరకన్నా తక్కువే అవుతుంది. ఈ సారీ అదే ధర పలికితే రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే పరిస్థితి ఉండదు.

మార్గదర్శకాలు రాలేదు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల ఎంపిక పూర్తయింది. కేంద్రానికి వచ్చే ధాన్యం నాణ్యత తదితరాల పరిశీలనకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. వస్తే ఆ ప్రకారమే అమలు చేస్తాం.

-విమల, పౌరసరఫరాల అధికారిణి, జోగులాంబ జిల్లా

యువతకు ప్రాధాన్యం: మంత్రి

అలంపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం అలంపూర్ హరిత టూరిజంలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకనే నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆరోపించారు. తెలంగాణ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పటిష్ఠం చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వివిధ శాఖల్లో 60 వేల ఉద్యోగాలను 10 నెలల్లో భర్తీ చేశామని మంత్రి పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించామని, మరో రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేస్తామని మంత్రి వివరించారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రతి జిల్లాలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి పురావస్తు శాఖతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మంత్రి ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో రుద్ర హోమం, అభిషేకం, జోగులాంబ ఆలయ సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, తదితరులున్నారు.



అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు తదితరులు

నేటి నుంచి బతుకమ్మ వేడుకలు



బాలుర జూనియర్ కళాశాల మైదానంలో చదును పనులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : బతుకమ్మ వేడుకలకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానం ముస్తాబవుతోంది. మెప్మా ఆధ్వర్యంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే వేడుకలకు పురపాలక సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వర్షాల కారణంగా కోతలకు గురై గడ్డి పెరిగి అధ్వానంగా మారిన మైదానాన్ని డోజర్లతో చదును చేసి ఎర్రమట్టి వేశారు. జడ్పీ కార్యాలయం, డీఈఓ కార్యాలయం నుంచి మైదానంలోకి వచ్చే రెండు ముఖద్వారాల వద్ద అందమైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మలు శోభాయమానంగా కనిపించేలా మైదానానికి నాలుగు వైపులా ఫ్లడ్‌లైట్లు బిగిస్తున్నారు. పట్టణంలోని 49 వార్డుల పరిధిలో ఉండే స్వయం సహాయక సంఘాల మహిళలు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు వేడుకల్లో పాల్గొంటారని ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. వేడుకలకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ బి.విజయేందిర, ఎస్పీ జానకి ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. మహిళలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కళాశాల మైదానంలో కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం నాడు ప్రథమ, ద్వితీయ, తృతీయ ఉత్తమ బహుమతులను ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.




ఫ్లడ్‌లైట్లు బిగిస్తున్న సిబ్బంది

చేప పిల్లల పంపిణీకి చర్యలు

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో సోమవారం నుంచి చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి రాధా రోహిణి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 1,091 చెరువులు ఉన్నాయని, వాటిలో మొదటగా 90 లక్షల చేప పిల్లలను వదులుతామని పేర్కొన్నారు. సోమవారం ఇబ్రహీంబాద్ హేమసముద్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, మత్స్యకారులు, సహకార సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

ముద్దబంతులు విరిసె.. బతుకమ్మ మురిసె!



బాలానగర్ మండలం గుండేడ్‌లో తోట

దేవరకద్ర మండలం గోప్లాపూర్‌లోని తోటలో నిలబడి చిత్రాలు దిగుతున్న ఓ కుటుంబం


ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలనే దేవతగా పూజించటం బతుకమ్మ పండగ ప్రత్యేకత. పల్లెల్లో బాలికలు నిత్యం వివిధ పూలతో బతుకమ్మలు తయారు చేసి సాయంత్రం వేళ ఆడిపాడుతున్నారు. ఈ పండగ వేళ ఉండే గిరాకీని దృష్టిలో పెట్టుకుని రైతులు ఇప్పటికే బంతి, ఇతర పూలతోటలు సాగు చేశారు. దేవరకద్ర మండలం గోప్లాపూర్, బాలానగర్ మండలం గుండేడ్ గ్రామాల్లోని రైతుల పూలతోటలు ఇలా విరగబూసి అందరికీ కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు బంతితోటలోకి వెళ్లి చరవాణులతో చిత్రాలు దిగుతూ మురిసిపోతున్నారు. కాసేపు అక్కడే సేదతీరుతున్నారు. ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం

మనసు పెడితే.. లక్ష్య ఛేదన సాధ్యమే!



'పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేం.'
-స్వామీ వివేకానంద



న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: విజయాలు గాలి వాటంగా ఎప్పుడూ రావు. అదేదో సినిమాలో అన్నట్టు వంద కాదు.. రెండు వందల శాతం ప్రయత్నిస్తే ఏనుగు కుంభస్థలాన్నైనా కొట్టొచ్చు. సాధించాలనే తపన, అందుకు తగినట్లుగా శ్రమిస్తే విజయ తీరాలు వెతుక్కుంటూ మీ వద్దకే వస్తాయి. ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో తప్పుతున్న వారి సంఖ్య రాష్ట్రంలోనే అధికంగా ఉంటోంది. ఇందుకు మనకు మనమే కారణం కాదా.. బోధనా లోపాలు, వసతులు లేవనే వాదనలు పక్కన పెట్టండి.. మన విజయానికి మనం చేస్తున్న కృషి ఎంతో ఆలోచించండి.. అప్పుడే ఇక రంగంలోకి దిగండి. విజయలక్ష్మి మిమ్మల్నెందుకు వరించదు. అది చదువైనా.. ఉద్యోగమైనా..

● నారాయణపేట జిల్లా కోస్గి పురపాలిక పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్ కుమార్ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే అయిదు ఉద్యోగాలు సాధించాడు. నీటి పారుదల శాఖ ఏఈఈ, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకునిగా, పురపాలిక పట్టణ ప్రణాళిక అధికారిగా, పంచాయతీరాజ్ ఏఈతో పాటు, గ్రూప్-4కు ఎంపికయ్యారు.

● మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన మహ్మద్ సుభాన్ మూడు ఉద్యోగాలు సాధించారు. వేర్వేరు గురుకులాల్లో రెండు అధ్యాపక పోస్టులకు ఎంపికయ్యారు. అలాగే పంచాయతీ కార్యదర్శిగానూ ఉన్నారు.

● కొల్లాపూర్‌లో చుక్కాయిపల్లికి చెందిన స్వప్న ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది.

● గత పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పాఠ్య పుస్తకం చదవడం అంశాల వారీ ప్రాధాన్యత తెలుసుకోవచ్చు.

● ఇతర వ్యాపకాలు తగ్గించి చదువుపైనే దృష్టి పెట్టాలి. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

● తెలుగులో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా, వాక్య నిర్మాణం సరిగా ఉండేలా సాధన చేయాలి. చక్కటి దస్తూరీ ప్రధానం.

● హిందీ వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. నేర్చుకోవడం, ఇతర విద్యార్థులతో మాట్లాడుతూ ఉండటం ద్వారా పట్టు సాధించవచ్చు.

● ప్రణాళికా ప్రకారం ఇంగ్లిష్ గ్రామర్ నేర్చుకోవాలి. తోటి స్నేహితులతో చర్చించి లెటర్ రాయడం అలవాటు చేసుకోవాలి. అపరిచిత గద్యభాగంపై సాధన చేయాలి.

● గణితంలో ప్రాథమిక భావనలు(కాన్సెప్ట్) బాగా నేర్చుకోవాలి. ప్రతి రోజూ రెండేసి లెక్కలు సాధనచేసినా పరీక్షల నాటికి 500 నేర్చుకోవచ్చు.

● సైన్స్ చిత్ర పటాలు బాగా నేర్చుకోవాలి. విద్యార్థులతో కలిసి చిత్రాలు వేయడం, సొంతంగా సాధన చేయాలి. ఇష్టమైన, సులభమైన పాఠ్యాంశాలను బాగా నేర్చుకోవాలి.

● సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లను చూడటం, దేశాలు, రాష్ట్రాలను గుర్తిస్తూ నేర్చుకోవడం, చరిత్రను గుర్తించుకునేలా పుస్తకాలు చదవడం.



ఇప్పటి నుంచే: తరగతి ఏదైనా విద్యార్థి వారి సామర్థ్యాలకు తగ్గట్లుగా రాణించడం ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో గతేడాది పదో తరగతిలో 44,898 మంది పరీక్షలు రాస్తే, 5,575 మంది అనుత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 36 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తే.. 30 శాతానికిపైగా ఫెయిలయ్యారు. వీరు పరీక్ష తప్పడంలో ఇతర కారణాలతో పాటు స్వ తప్పిదాలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు మనసా వాచా కర్మణా పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా 5 నెలలకు పైగా సమయం ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదవగలిగితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చు. జిల్లా ఖ్యాతినీ ఇనుమడింపజేయవచ్చు.



ఇలా చేయాలి

● నిరంతర అభ్యసనం ప్రధానం. దీని ద్వారా అనేక సమస్యలకు సమాధానాలు సొంతంగా తెలుసుకుంటారు.

● ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, వాటిని నేర్చుకొని అమలు చేయాలి.



త్రికరణ శుద్ధితో చదవాలి: కొందరు విద్యార్థులు చేయాల్సింది చేయకపోవడం, అవసరం లేనిది చేస్తుండటంతో వెనుకబడిపోతున్నారు. ఇలా కాకుండా ప్రతి విద్యార్థి ఎందుకు చదవాలి? లక్ష్యం ఏమిటనేది తెలుసుకోవాలి. వారిలో ఎదగాలనే కోరిక ఉండాలి. ప్రతి విద్యార్థికి చదువు చిట్టచివరి లక్ష్యం కావాలి. త్రికరణ శుద్ధితో చదవాలి. అందుకు అనుగుణంగా శ్రమిస్తే రాణించడం పెద్ద కష్టమేమీకాదు. మూలాలపై శ్రద్ధ పెట్టి ముందుకెళితే తప్పకుండా విజయం సాధిస్తారు.

-డా.శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

సర్పాలన్నీ విషపూరితం కాదు



మన్ననూరులో పాములపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు సదాశివయ్య, ఎఫ్‌డీవో రామమూర్తి

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: పరిసరాల్లో కన్పించే సర్పాలన్నీ విషపూరితమైనవి కావని అందులో రెండు మాత్రమే విషపూరితమైనవని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సదాశివయ్య పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని మన్ననూరులో నిర్వహించిన పాముల ప్రదర్శనలో పాములపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో పాములది కీలక పాత్ర అన్నారు. పంటలకు చేటు చేసే ఎలుకలు, చిన్న చిన్న జీవులను పాములు తింటాయన్నారు. మన పరిసరాల్లో ముఖ్యంగా 8 రకాల సర్పాలున్నాయని అందులో నాగుపాము, కట్లపాము మాత్రమే విషపూరితమైనవన్నారు. పాములను చంపకుండా వదిలేస్తే పొలాల్లోని ఎలుకలు, చిన్న కీటకాలను తిని జీవిస్తాయన్నారు. తమకు ప్రమాదం ఉందని భావించిన సందర్భంలోనే పాములు కాటేస్తాయన్నారు. వాటికి మనం ఏ హానీ తలపెట్టకపోతే అవి మనను ఏమీ చేయవన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పాములను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో రామమూర్తి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

రూ.2.79 కోట్లతో అలంకరణ



ఆత్మకూరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాతను రూ.2.29 కోట్ల నగదుతో ధనలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వచ్ఛందంగా అలంకరణకు నగదును సమర్పించారు. తెల్లవారుజామున ప్రారంభమైన అలంకరణ మధ్యాహ్నం 11.30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య దంపతులు అష్టోత్తర నామావళి పారాయణం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.

ఉమామహేశ్వరం ధర్మకర్తల మండలి నేడు ప్రమాణస్వీకారం

భోగ మహేశ్వరంలో ఏర్పాట్లు ● హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ



నల్లమల కొండల్లో వెలసిన ఉమామహేశ్వరం ఆలయం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రముఖ శైవ క్షేత్రం ఉమామహేశ్వర ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రి హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉమామహేశ్వరం చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార సభలో పాల్గొని మాట్లాడనున్నారు. తరువాత అచ్చంపేటకు చేరుకొని మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల సమావేశంలో పాల్గొననున్నారు.

● ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గంలో 14 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొండ దిగువన భోగ మహేశ్వరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా పులిజాలకు చెందిన బీరం మాధవరెడ్డిని నియమించారు. కొండపైకి రూపాలి విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని మంత్రికి కొత్త పాలకవర్గం వినతిపత్రం అందజేయనుంది.

పట్టపగలే.. దొంగ దొంగ..!



వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం(పాత)



న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

దొంగతనాలు అంటే చిమ్మ చీకట్లో జరిగేవి. ఒకప్పుడు ఏదైనా చోరీ జరిగినప్పుడు ఇది ఏ ముఠాపని అయి ఉంటుందో అన్న కోణంలో పోలీసులు విచారించేవారు. ఇటీవల కాలంలో పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం చోరీలు జరగడం పరిపాటిగా మారింది. మామూలు వ్యక్తులుగా సంచరిస్తూ, తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇరుగుపొరుగు వారికి కూడా అనుమానం రాని రీతిలో తాళాలను కోసేసి గుంభనంగా పని కానిచ్చేస్తున్నారు. పట్టణాల్లో సాంకేతికత అందుబాటులోకి రావడంతో సులువుగా పట్టుబడతామని భావించి తెలివిగా గ్రామాలను ఆధారం చేసుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్నవారి స్థితిగతులను ముందే అధ్యయనం చేస్తున్నారు.

● పల్లెల్లో సీసీ కెమెరాలు వంటి సాంకేతికత అందుబాటులో లేకపోవడం, జనం పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడంతో పట్టపగలు వారి పని సులువు అవుతోంది. గతంలో జరిగే దొంగతనాలను చాలా వరకు చరవాణి ఆధారంగానే కనుగొనేవారు. దొంగలు తెలివిగా చరవాణులను వెంట తీసుకురాకుండా ద్విచక్ర వాహనాలపై గ్రామాలకు చేరుకొని తమ పని చేసుకొని ఉడాయిస్తున్నారు. చుట్టాల ఊరికి వచ్చినట్లు కలర్ ఇస్తూ ఎవరికీ అనుమానం రాని రీతిలో సంచరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.



కచ్‌వార్ గ్రామంలో చోరీకి గురైన ఆభరణాల పెట్టెలు (పాత)

ఏం చేయాలి?

● పట్టపగలు తాళం వేసుకుని వెళ్లకూడదు. ఇంట్లో ఎవరైనా ఉండాలి. తప్పనిసరి వెళ్లాల్సి వస్తే ఇరుగు, పొరుగువారిని అప్రమత్తం చేయాలి. ప్రస్తుత రోజుల్లో చరవాణి లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. ఇంట్లో ఏదైనా అలికిడి జరిగేటప్పుడు చరవాణికి సంకేతాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. మార్కెట్‌లో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

● విలువైన వస్తువులు, బంగారం వంటివి బయటకు వెళ్లేటప్పుడు తెలిసిన వారికి అప్పగించాలి.

● గ్రామంలో అపరిచితులు ఎవరైనా ప్రవేశిస్తే గట్టిగా ప్రశ్నించి నిర్ధారించుకోవాలి.



మచ్చుకు కొన్ని ఘటనలు

● మక్తల్ మండలం కాచ్‌వార్‌లో అశోక్ రెడ్డి ఇల్లు ఊరికి చివరన ఉండటం, తాళం వేసి ఉండటంతో పట్టపగలు చోరీ జరిగింది. కాట్రేవ్‌పల్లి, మంథన్‌గోడ్ గ్రామాల్లోనూ పట్టపగలు చోరీలు జరిగి నగదు, నగలు అపహరణకు గురయ్యాయి. ఊట్కూరు మండలం చిన్నపొర్లలోనూ పట్టపగలు నగదు, డబ్బులు దొంగతనం చేశారు. నారాయణపేట మండలం పెద్దజట్రంలో అదే రీతిలో జరిగింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో ఏకంగా ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేసి నగదు దోపిడీ చేశారు.

● ఇటీవల కోస్గి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు రుణం కట్టేందుకు పేట వచ్చారు. రూ.3లక్షలకు పైగా నగదు ఉన్న బ్యాగును కారులో ఉంచి రోడ్డుపై వాహనం నిలిపి బ్యాంకులోకి వెళ్లాడు. అప్పటికే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారును వెంబడించి అదును చూసి కారు అద్దాలు పగలగొట్టి అపహరించుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. సీసీ కెమెరాలో అంతా రికార్డు అయినా ఇంతవరకు దొంగలు దొరకలేదు.

● నారాయణపేట జిల్లాలో 97, మొత్తం ఉమ్మడి జిల్లాలో 550 వరకు చోరీ ఘటనలు జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగాయి. వాటిని విశ్లేషించినప్పుడు పట్టపగలు దొంగతనాలు ఎక్కువగా జరగడం పోలీసులను నివ్వెరపరుస్తోంది.

జోగులాంబకు ఏపీ ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కర్నూల్ కలెక్టర్ రంజిత్ బాషా దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ నాగేశ్వర రెడ్డి, ఈవో పురేందర్, అర్చకులు, కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ: ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.



భిన్నంగా నడపాలని..!

నేటితరం చిన్నారులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటోంది. వినూత్న ప్రయోగాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించాలని తపన వారిలో కనిపిస్తోంది. భూత్పూర్ మండలం ఎల్కిచర్ల గ్రామంలో ఓ బాలుడు తన సైకిల్ చక్రాలకు ఉన్న రెండు టైర్లను తొలగించాడు. కేవలం రిమ్‌లతోనే సైకిల్‌ను తొక్కుతూ ఇలా 'ఈనాడు' కెమెరాకు చిక్కాడు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదు



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదని, దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాలు, రాజ్యాంగాలకు రక్షణ లేదని, ఈ సమస్యలకు రక్షణగా నిలిచి దాని కోసం పోరాటం చేసేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సీపీఎం కార్యదర్శి జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభలో మాజీ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, మాజీ ఎంపీ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలసి తమ్మినేని వీరభద్రం లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో మూడోసారి మతోన్మాద వ్యక్తుల చేతుల్లో పాలన సాగుతుందని, ఆర్థిక సంపద అంతా అదానీ, అంబానీలకు పంచి పెడుతున్నారన్నారు. రైతు రుణమాఫీలో ఇంకా 18 లక్షల మందికి రూ.17 వేల కోట్లు బ్యాంకులో వేయాల్సి ఉందని, దాని కోసం రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. భాగ్యనగరంలో ఆక్రమించిన చెరువుల కాల్వలను వాటిని పునరుద్ధరించాలన్నా పేరుతో ప్రభుత్వం హైడ్రా పేరిట కూల్చివేతలు ప్రారంభించిందని, దీనిని సీపీఎం పార్టీ వ్యతిరేకించడం లేదని కానీ, పేదల జోలికి వస్తే మాత్రం పూర్తిగా ఖండిస్తామన్నారు. నల్లగొండ జిల్లా వెంట ప్రవహించే మూసి నీటితోనే పొలాలు పండించే పరిస్థితి ఆయా ప్రాంతాల్లో ఉందని వీటి పై దృష్టి పెట్టకుండా సుందరీకరణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజాహితం కోరుతూ ప్రజల తరఫున పోరాటానికి మనం చేయాల్సిన పని చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, విజయరాములు, అర్జున్, పుట్ట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్వ, న్యూస్‌టుడే : లంకాల గ్రామానికి చెందిన దుప్పల్లి శ్రీనివాసులు, అతని కుమారుడు రాముతో కలిసి ఆదివారం ద్విచక్ర వాహనంపై రాంపూర్ గేటు నుంచి సొంతూరు లంకాల వస్తున్నారు. లంకాల చెరువుకట్ట దాటిన తర్వాత మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పటాన్‌చెరుకు చెందిన బులేరో వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి క్షతగాత్రులయ్యారు. శ్రీనివాసులు(45) తలకు బలమైన గాయాలై రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందారు. రాము కుడికాలుకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమయ్య తెలిపారు.

కారు బోల్తాతో మరొకరు..

ఇటిక్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కకు కారు బోల్తాపడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లు ఎదురుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు బోల్తాపడింది. దీంతో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్తున్న కర్నూలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఆయన ఒక్కరే ఉన్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలోని ఆల్కాలిస్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు.

రోడ్డు ప్రమాద మృతుడు ఛత్తీస్‌గఢ్ కూలీ

గాయపడిన మరొకరి పరిస్థితి విషమం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలోని ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం 'ఈనాడు' పాఠకులకు విదితమే. వారిని ఛత్తీస్‌గఢ్ కూలీలుగా పోలీసులు గుర్తించారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ముర్వ(54), కాలురాం రెండు వారాల క్రితం బతుకుదెరువు కోసం జడ్చర్లకు వచ్చారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆ ఇద్దరూ కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వచ్చారు. జాతీయ రహదారి-44పై ఫ్లైఓవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ముర్వ అక్కడికక్కడే మృతిచెందగా కాలురాం తీవ్రంగా గాయపడ్డాడు. కాలురాంను హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. ముర్వ కుమారుడు రాంనారాయణ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.



చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

మిషన్ భగీరథ లీకేజీకి మరమ్మతులు

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : వెంకట్‌రెడ్డిపల్లి గేట్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీకి అధికారులు మరమ్మతులు చేపట్టారు. లీకేజీ కారణంగా కాలనీలోకి వెళ్లడానికి జనం ఇబ్బందులు పడుతున్న వైనంపై 'మేమున్నాం.. మీకు తోడుగా' కింద 'ఈనాడు'లో వార్త ప్రచురితం కాగా మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ స్పందించారు. సిబ్బందితో లీకేజీకి మరమ్మతులు చేయించారు.

తెరపై ఈనాడు

బాలాజీ - దేవర, తిరుమల - దేవర, వెంకటేశ్వర - దేవర, వెంకటేశ్వర - సత్యం సుందరం, శ్రీకృష్ణ - జోకర్ (ఉదయం ఆటలు), దక్షిణ (రాత్రి ఆటలు)
– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

హిందూధర్మ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



జడ్చర్లలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల కవాతు

జడ్చర్ల, న్యూస్‌టుడే : హిందూధర్మ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయమని సంఘ నేతలు పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి పురస్కరించుకొని జడ్చర్ల పట్టణం నేతాజీ చౌక్ సమీపంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నేతలు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే హిందూ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని, ధర్మాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాలమూరు విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు వసంతం వెంకటేశ్, సురేష్, గుండేరావు, శివకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తితిదే ఆధ్వర్యంలో గీతాకంఠస్థ పోటీలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : డిసెంబరు 11న గీతా జయంతిని పురస్కరించుకుని తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు తితిదే కార్యక్రమ ఉమ్మడి జిల్లా అధికారి డా.ఉత్తరపల్లి రామాచారి వెల్లడించారు. భగవద్గీతలోని 6వ అధ్యాయంలో శ్లోకాలు పఠించేందుకు ఉంటుందన్నారు. 6, 7, అలాగే 8, 9 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలు వల్లిస్తే 18 ఏళ్లు పైబడిన వారికి కూడా వేరుగా పోటీలుంటాయన్నారు. నవంబరు 30న ఉదయం 10 గంటలకు వనపర్తి జిల్లాకు సంబంధించి అక్కడి సరస్వతి శిశుమందిర్‌లో, నారాయణపేట జిల్లావారి పోటీలను డిసెంబరు 1న మరికల్‌లోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో, నాగర్‌కర్నూల్ జిల్లా పోటీలు డిసెంబరు 4న కల్వకుర్తిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో, జోగులాంబ గద్వాల జిల్లావారి పోటీలు డిసెంబరు 7న గంజిపేటలోని శ్రీసరస్వతి టాలెంట్ హైస్కూల్‌లో, డిసెంబరు 10న మహబూబ్‌నగర్ జిల్లావారి పోటీలు జిల్లాకేంద్రంలోని తితిదే కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 93475 40005, 73967 11574 నంబర్లలో సంప్రదించాలన్నారు.



మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీలోని వాసవీమాత ఆలయంలో.. నృసింహస్వామి ఆలయంలో.. రవీంద్రనగర్‌లోని శీతలాదేవి.. వనపర్తిరోడ్డులో రేణుకా ఎల్లమ్మ.. గాంధీనగర్‌లో.. జడ్చర్ల : సకల దేవతల ఆలయంలో..
రాజాపూర్ : రంగారెడ్డిగూడలోని ఆలయంలో అన్నపూర్ణదేవిగా.. భూత్పూర్ : అమిస్తాపూర్‌లోని శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో..



దేవరకద్ర : శ్రీవేంకటేశ్వరస్వామి వారి అలంకారంలో వాసవీమాత



గండీడ్ : పంచాంగల్ తండాలో..

అమ్మవు నీవే అఖిల జగాలకు!

న్యూస్‌టుడే బృందం : శరన్నవరాత్రి మహోత్సవాల నాలుగో రోజు ఆదివారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో దుర్గామాతను నోట్లతో చూడచక్కగా అలంకరించి పూజించారు. మహబూబ్‌నగర్ పట్టణం బ్రాహ్మణవాడలోని శ్రీవాసవీమాత ఆలయంలో రూ.6,66,66,666లతో అలంకరణ చేసిన అమ్మవారిని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు దర్శించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఏనుగొండతో పాటు వివిధ ప్రాంతాల్లో దుర్గామాత మండపాలను దర్శించి పూజలు చేశారు. అంబేడ్కర్‌నగర్‌లోని వెలసిన దుర్గామాతను మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ దర్శించి పూజించారు. శ్రీనివాసకాలనీలోని శ్రీవాసవీమాత ఆలయంలో రూ.35,35,353లతో, రవీంద్రనగర్‌లోని శీతలాదేవి ఆలయంలో రూ.13,50,500లతో అమ్మవారిని అలంకరణ చేశారు. రేణుక ఎల్లమ్మ వనదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. వీరన్నపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, సింహగిరిలో లలితా త్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్నారు. వేంకటేశ్వర, లక్ష్మీనగర్‌కాలనీలోని రాజరాజేశ్వరి మాత ఆలయంలో, పంచముఖ ఆంజనేయస్వామి కాలనీలో సామూహిక వ్రతాలు ఆచరించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట, వెంకటేశ్వరకాలనీ, శ్రీనివాసకాలనీ తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. జడ్చర్ల పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఉడిత్యాలలో ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవీగా, అమిస్తాపూర్‌లోని శ్రీజ్ఞానసరస్వతి దేవాలయంలో అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పురపాలిక ఛైర్మన్ బస్వరాజుగౌడ్ దర్శించుకుని పూజలు చేశారు. రాజాపూర్, దేవరకద్ర, కొత్తకోట, చిన్నచింతకుంట, గండీడ్, మహమ్మదాబాద్, కోయిలకొండ, అడ్డాకుల, మూసాపేట మండలాల్లో పూజలు చేశారు.



కోయిలకొండలో అమ్మవారు..



మహబూబ్‌నగర్ : వెంకటేశ్వర, లక్ష్మీనగరకాలనీలో సామూహిక కుంకుమార్చన



మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో..



ఏనుగొండలో దుర్గామాత సన్నిధిలో ఎమ్మెల్యే యెన్నం దంపతులు, భక్తులు



మిడ్జిల్ : వాడ్యాల్‌లో అమ్మవారి వద్ద భక్తులు



మహబూబ్‌నగర్ : అంబేడ్కర్‌నగర్‌లో దుర్గామాత వద్ద మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్.. వేంకటేశ్వరకాలనీలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు.. వీరన్నపేటలో.. జడ్చర్ల : కన్యకాపరమేశ్వరి ఆలయంలో.. కౌకుంట్లలో హోమం చేస్తున్న భక్తులు..

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : పురపాలిక పరిధి శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇళ్ల యజమానులకు భరోసా ఇచ్చారు. 3వ వార్డు అప్పన్నపల్లి సమీపంలోని పవనపుత్రకాలనీలో రూ.10 లక్షలతో నిర్మించే భూగర్భ డ్రైనేజీకి ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం కాలనీలో ఉన్న ఇళ్ల యజమానులతో కలిసి అక్కడి పవనపుత్ర ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణానికి సరిహద్దుల్లో ఉండే కొత్త కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వలు వంటి మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత పురపాలక సంఘంపై ఉంటుందన్నారు. కొత్తగా వెలసిన కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ భారాస పాలనలో విలీన గ్రామాలను పూర్తిగా విస్మరించటం సీసీరోడ్లు, డ్రైనేజీలు కూడా కరవయ్యాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికే వార్డుల వారీగా రూ.50లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, నాయకులు సిరాజ్ ఖాద్రి, హన్మంతు, శివశంకర్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ రామాంజనేయులు

రాజ్యాంగ హక్కుల్ని హరించే కుట్ర

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రాజ్యాంగ హక్కుల్ని హరించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని అలీగఢ్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డా.మిదహతుల్లా అహ్మద్ షేర్వాని ఆరోపించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో సీపీఐ తంజీమే ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధ, జైన తదితర మైనారిటీ వర్గాలను దేశంలో రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దేశ సమగ్రత, ఔనత్యాన్ని దెబ్బతీసేలా పాలన విధానాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తంజీమే ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.అయూబ్ అలిఖాన్, నాయకులు ఇర్ఫాన్ ఆలం, ఇస్లాముద్దీన్, షకీబ్ ఉర్ రహమాన్, ఫయాజ్, మునీర్ పటేల్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు బి.పరమేశ్వర్ గౌడ్, పి.సురేశ్, డి.రాము, చాంద్‌బాషా, సత్యానారాయణరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డా.మిదహతుల్లా అహ్మద్ షేర్వాని

పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటాలి

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటాలని దేవరకద్ర నియోజకవర్గ భాజపా ఇన్‌ఛార్జి కొండ ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర మండలం గోపన్‌పల్లి గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలు పట్టుదలతో పనిచేసి భాజపా అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యకర్తలు కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామంలో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు.

మహబూబ్‌నగర్ గ్రామీణం : భాజపా సభ్యత్వాలు భారీఎత్తున చేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మహబూబ్‌నగర్ పురపాలిక దొడ్డలోనిపల్లి వార్డులో ఇంటింటికీ వెళ్లి భాజపా సభ్యత్వాలు చేశారు. బూత్‌స్థాయిలో కన్వీనర్ ఆధ్వర్యంలో రోజూ సభ్యత్వాల నమోదు జరగాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పనితీరును ప్రజలకు వివరించాలని కోరారు. భాజపా పట్టణాధ్యక్షుడు నారాయణయాదవ్, శక్తికేంద్రం ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, నాయకులు కాటం నాగరాజు, యాదయ్య, లాలు తదితరులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలో భాజపా సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న కొండ ప్రశాంత్‌రెడ్డి

ఒప్పంద సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

మిడ్జిల్, న్యూస్‌టుడే: ఒప్పంద పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఒప్పంద ఆరోగ్య సహాయకుడు ఆశన్న ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. సంఘం తరఫున ఆశన్న కుటుంబానికి రూ.51,111లను అందించారు. ఆశన్న కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు చాంద్ పాషా, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, దేవయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పాలమూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం అందరికీ అందుబాటులో ఉంటానని పీఆర్టీయూ జిల్లా నూతన అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ కార్యాలయంలో నూతన జిల్లా కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలాలకు నూతనంగా ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టిన వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు తమ సంఘం సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సర్వీసుల అంశాలకు సంబంధించిన బదిలీలు, పదోన్నతులు, సాధారణ సెలవులు, సంపాదిత సెలవులు, ఎన్నికల్లో పనిచేసిన వాటి అంశాలు, జీపీఎఫ్ సమస్యలపై డీఈవో దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఏ సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకరావాలన్నారు. పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బుచ్చారెడ్డి, గట్టు వెంకట్‌రెడ్డి, సంఘ సభ్యులు తిమ్మారెడ్డి, గోపాల్ గౌడ్, రఘురాం రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అశ్విని చంద్రశేఖర్, సురేశ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండలాలకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవోలకు సన్మానం చేస్తున్న పీఆర్టీయూ జిల్లా నాయకులు

ఊరికి వెళ్లేవారు సమాచారం ఇవ్వాలి

బాలానగర్, న్యూస్‌టుడే : దసరా పండగకు ఇళ్లకు తాళాలు వేసి ఊరికి వెళ్లే ప్రజలు విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తిరుపాజీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు నగలు, డబ్బు ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. బీరువా తాళం చెవులను దుస్తుల కింద, ఇంట్లో పెట్టుకోవద్దన్నారు. అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డుపై పంట నూర్పిడి చేస్తే చర్యలు

నవాబ్‌పేట,న్యూస్‌టుడే : ప్రధాన రహదారులపై ఎవరైనా పంట నూర్పిడికి పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై విక్రమ్ తెలిపారు. రోడ్డుపై పంటనూర్పిడులు, ధాన్యం ఆరబోయటం, కుప్పలు చేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పంట నూర్పిడి కల్లాలలోనే చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలని కోరారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న జాతీయ సాహిత్య పరిషత్ ప్రతినిధులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జడ్చర్లలోని ఓ వేడుకల మందిరంలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాఘవయ్య, జయప్రకాశ్, రవిప్రకాశ్, అబ్దుల్‌అలీం, సుజాత, బింధు మాధవి తదితరులను సత్కరించారు. మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసేది ఉపాధ్యాయులేనని కొనియాడారు. కౌన్సిలర్ సతీష్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు చిగుళ్లపల్లి పద్మలీల, చక్రవర్తుల కిరణ్మయి, దత్తుకుమార్, కృష్ణమోహన్, జానకిరాములుగౌడ్, చక్రవర్తుల వెంకటరమణాచార్యులు, రాధాకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్సీని వెంటనే అమలు చేయాలని పింఛనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలు గౌడ్, బాలకిషన్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4 కరవు భత్యం (డీఏ)లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్ పథకంలో పింఛనర్లకు భాగస్వామ్యం కల్పించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఏప్రిల్ నుంచి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు సత్వరం చెల్లించాలని కోరారు.

అనుమతి లేని డబ్బాల తొలగింపు

హన్వాడ, న్యూస్‌టుడే : హన్వాడలోని గ్రామ కంఠం భూమిలో కొందరు ఎలాంటి అనుమతి లేకుండా డబ్బాల(దుకాణాలు)ను ఏర్పాటు చేయటంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆదివారం పోలీసుల సాయంతో తొలగించారు. 8 మంది అనుమతి లేకుండా డబ్బాలను ఏర్పాటు చేశారని, కొందరు రాళ్లతో బెస్‌మెంట్‌లను ఏర్పాటు చేశారని పిర్యాదులు రావటంతో ఆమె పొక్లెయిన్‌తో తొలగించారు. కొందరు అడ్డుపడటంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు.

వెనకబాటులోనే మోచి సామాజిక వర్గీయులు

మహబూబ్‌నగర్ గ్రామీణం : సమాజంలో మోచి సామాజిక వర్గీయులు ఇప్పటికీ వెనకబాటుతనంలోనే ఉన్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు మాణిక్యప్ప అన్నారు. మహబూబ్‌నగర్‌లోని పుట్నాలబట్టి వద్ద మోచి సంక్షేమ సంఘ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా మోచి కులస్థుల తలరాతలు మారడం లేదన్నారు. మోచీలను ఎస్సీ బీ కేటగిరిలోనే కొనసాగించాలని, రిజర్వేషన్లు 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నారాయణపేట, వనపర్తి, హైదరాబాద్ జిల్లాల మోచీ సంఘం అధ్యక్షులుఏలేరి సత్యనారాయణ, వనగంటి నాగేశ్వర్, ఈశ్వరప్ప, నాయకులు దేవేంద్రప్ప, వనగంటి పాండు, వెంకటేష్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

అడ్డాకుల, న్యూస్‌టుడే : అడ్డాకుల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి స్వర్ణ పతకం అందుకోవాలని బాస్కెట్‌బాల్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాకెర్ ఆకాంక్షించారు. ఆదివారం డీఎస్‌ఏ మైదానంలో ఉమ్మడి జిల్లా మహిళా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికల్లో పాల్గొని మాట్లాడారు. బాలికలు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించటం అభినందనీయమన్నారు. ఈ టోర్నీని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి నస్రుల్లా హైదర్, ప్రతినిధులు మీర్ ఖాలెద్ అలి, ఇలియాజ్, ఫరూఖ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్టు ఇదే..: హైదరాబాద్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. కె.జ్యోతి, కె.ప్రియాంక, పి.అర్చిత, టి.సిరివల్లిక, జి.భువనేశ్వరి, కె.సాయినిఖిత, ఎన్.హరిత, జి.చైత్ర, ఎం.శ్రీలత, కె.హరిణి, మేఘన, జి.వైష్ణవి జట్టులో చోటు సంపాదించారు.



ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుతో జిల్లా అధ్యక్షుడు తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కాటేదాన్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మైలార్‌దేవుపల్లి ఠాణా పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మహబూబ్‌నగర్‌కు చెందిన రాజు(40) జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం కుటుంబంతో వలస వచ్చి అత్తాపూర్‌లో నివసిస్తున్నాడు. గృహనిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న ఆయన తోటి కార్మికుడు రమేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున చాంద్రాయణగుట్టకు బయల్దేరాడు. దుర్గానగర్ సమీపంలోకి చేరుకోగానే వీరి వాహనాన్ని వెనకనుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ చక్రాల కింద పడ్డ రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



రాజు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గండీడ్, న్యూస్‌టుడే : చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందిన ఘటన గండీడ్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె.శ్రీహరి(21) ప్రేమ విషయంలో మనస్తాపానికి గురై గత నెల 13న పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించారు. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కె.శ్రీహరి

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : రాత్రి ఇంట్లో పడుకున్న వ్యక్తి శవంగా మారటంతో అనుమానం వచ్చి అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలం రాళ్లగడ్డతండాకు చెందిన ఇస్లావత్ బబ్లూ(31) వ్యవసాయం చేస్తాడు. ఈ నెల 4న పొలానికి పురుగు మందు పిచికారీ చేసి అస్వస్థతకు గురైన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యాడు. తన భార్యతోనూ అతడికి గొడవ జరుగుతుండేది. శనివారం రాత్రి ఇంట్లో పడుకున్న ఆయన ఆదివారం ఉదయం చూసేసరికి విగతజీవిగా ఉన్నాడు. మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్యమిత్ర ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : తనను నమ్మిన వారు మోసం చేశారని ఓ ఆరోగ్యమిత్ర ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలంలోని రాంచంద్రాపూర్‌కు చెందిన ప్రదీప్‌కుమార్ ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్నారు. భూమి విషయంలో బంధువుతో పాటు ఇతరులు మోసం చేశారని మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఆదివారం ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. తమకు ఫిర్యాదు రాలేదని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జడ్చర్ల, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి మూర్ఛ వచ్చింది. అతడి ద్విచక్రవాహనం అదుపుతప్పి అటుగా వెళ్తున్న మరో వ్యక్తిని ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్సు అందుబాటులో లేదు. అక్కడి నుంచి వస్తున్న నాయకులు మిన్‌హాజ్, శ్రీకాంత్ క్షతగాత్రులను ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనదారుడికి బలమైన గాయాలయ్యాయి. బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక వాహనాల పట్టివేత

రాజాపూర్, న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది పట్టుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. శనివారం రాత్రి మల్లేపల్లి శివారులో ఇసుకను తయారు చేసే ట్రాక్టర్ ఇంజిన్, ఆదివారం ఉదయం కుచ్చూర్‌కల్ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను ఠాణాకు తరలించి, కానిస్టేబుల్ సుదర్శన్ ఫిర్యాదు మేరకు డ్రైవర్లు ఉడిత్యాల రవి, ఎర్ర నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.